## క్లుప్తంగా...

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జెకెకాలనీ, రోడ్డు నెంబర్–1, వాసవీ ఇంద్రప్రస్థా బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

### లోకేష్‌యాదవ్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ చరిత్ర విభాగం విద్యార్థి లోకేష్‌యాదవ్‌కు డాక్టరేట్ లభించింది. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కల్చర్ అండ్ టూరిజం ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశం పై పరిశోధన పూర్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వైరా మండలం, సిరిపురం(కేజీ) గ్రామం రైతు కుటుంబానికి చెందిన గంగదేవుల నరసయ్య, ఆదిలక్ష్మీ దంపతుల కుమారుడు లోకేష్ ఖమ్మంలో డిగ్రీ పూర్తి చేసి ఓయూలో పీజీ చదవుతు తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీ నాయకుడిగా కీలక పాత్ర పోషించారు.

### దయానంద ఉత్సవాల కమిటీ సభ్యుడిగా ఓయూ అధ్యాపకుడు



ధర్మతేజ

ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్య సమాజ్ మందిర్ వ్యవస్థాపకులు, ఫ్రీడం ఫైటర్ మహర్షి స్వామి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాల కమిటీ సభ్యుడిగా డాక్టర్ ధర్మతేజ నియమితులయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ ఛైర్మన్‌గా 97 మంది సభ్యులలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆర్య సమాజ్ ప్రాంతీయ ప్రతినిధిగా కొనసాగుతున్న ఓయూ బీఈడీ కాలేజీ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ధర్మతేజ నియామకం పట్ల నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.

### ఓయూ భూమిలో ఆస్పత్రి నిర్మాణాన్ని అడ్డుకుంటాం



వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు చెందిన 2 ఎకరాల భూమిలో బయటి వ్యక్తుల కోసం ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తే అడ్డుకుంటామని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓయూ భూములు వీసీ ప్రొ.రవీందర్ సొంత ఆస్తి కాదని యావత్తు తెలంగాణ విద్యార్థుల సొత్తు అని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూమ్‌ల కోసం ఓయూ భూములను కాజేసేందుకు సీఎం కేసీఆర్ పదేళ్ల క్రితం ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారని, ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, వీసీ రవీందర్‌ను పావులుగా వాడుకుంటూ వర్సిటీ భూముల కబ్జాకు వ్యూహా రచన చేశారని ఆరోపించారు. గతంలో జస్టిస్ చెన్నప్పరెడ్డి కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం ఓయూ భూములు ఇతరులకు కట్టబెట్టకూడదని గుర్తు చేశారు.

### తన పర్యటన అడ్డుకున్నారంటూ ఫిర్యాదు

అమీర్‌పేట: బస్తీలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తే ఓ పార్టీ నాయకుడు అడ్డుకున్నాడని ఆరోపిస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆదివారం రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అమీర్‌పేట డివిజన్‌లోని బౌద్ధనగర్‌కు వచ్చిన ఆమె నాయకులతో కలిసి రాజీవ్ విగ్రహానికి నివాళులర్పించారు.అనంతరం బస్తీలోకి వెళ్లగా మహిళలు తమ సమస్యలను వివరిస్తుండగా సత్యనారాయణ వచ్చి అడ్డు పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

### రేషన్ కార్డులను జారీ చేయాలి

లాలాపేట: రాష్ట్రంలోని అర్హులైన వారందరికి తక్షణమే కొత్త రేషన్ కార్డులను జారీ చేయాలనీ ఎస్సీ ఎస్టీ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సేనాధిపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన అనంతరం ఏడేళ్ల నుంచి ఇప్పటి వరకు రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో చాలా మంది పేద ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు లేనికారణంగా దరఖాస్తు చేసుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి నూతన రేషన్ కార్డులను జారీ చేయాలన్నారు.

### దేవస్థానం అభివృద్ధికి చర్యలు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హామీనిచ్చారు. దేవస్థానం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు భూలక్ష్మీ ఆలయ ధర్మకర్త విశాల్ సూదం రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి ఎన్ని కోట్లయినా వెచ్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కూకట్‌పల్లిలో పురాతన రామాలయాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తుచేశారు.



# కాంగ్‌రేసులో ముగ్గురు!

**సనత్‌నగర్ మూడు ముక్కలాట | టికెట్ తమకే అంటూ ప్రచారం | పోటాపోటీగా సమావేశాలు, కార్యక్రమాలు**

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట కొనసాగుతోంది. ఇటీవల తెరమీదకు వచ్చిన ముగ్గురు ఎవరికి వారు టికెట్ తమకేనంటూ ఆశల పల్లకిలో ఊరేగుతున్నారు. తమదైన శైలిలో సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే.. కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రం ఎవరి వైపు వెళ్లాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల మర్రి శశిధర్‌రెడ్డి బీజేపీలోకి చేరిన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అధిష్ఠానం ఎవరికీ అప్పజెప్పలేదు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం అనంతరం రాష్ట్ర కాంగ్రెస్‌లో కూడా నూతనోత్సాహంగా పెల్లుబికింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో సైతం కాంగ్రెస్‌కు పూర్వవైభవం రానుందన్న విశ్వాసం ఆ పార్టీ నేతల్లో పెరిగింది. అప్పటివరకు అధిష్ఠానం ఇచ్చే పిలుపునకు స్పందించి నియోజకవర్గంలో ముందుండి నడిపించే నాయకులు ఎవరూ కానరాని పరిస్థితి ఉండగా అనూహ్యంగా ముగ్గురు నేతలు తెరమీదకు వచ్చారు.

### గందరగోళంలో కాంగ్రెస్ కేడర్..

కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరికి టికెట్ కేటాయిస్తుందన్న విషయం పక్కనబెడితే. టికెట్ తనకే వస్తుందంటూ తెరమీదకు వచ్చిన ముగ్గురు నేతల వ్యవహారశైలితో అయోమయంలో పడ్డారు. మర్రి శశిధర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోనే ఉండగా ప్రథమ, ద్వితీయ శ్రేణి నేతలంతా బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. ఇక ఆయన బీజేపీ కండువా కప్పుకున్న తర్వాత కొంత మంది ఆయన వెంట వెళ్లగా మిగతా క్యాడర్ నియోజకవర్గ ఇన్‌చార్జి లేక విచ్ఛిన్నమైపోతున్నారు. ముగ్గురు నేతలు ఎవరికి వారు కార్యక్రమాలు చేసుకుంటూ వెళ్తుండడంతో ఏం చేయాలో డైలామాలో పడ్డారు. అసలు ఎవరికి మద్దతుగా నిలవాలో, ఎవరి వెంట వెళ్లాలో అర్థం కాక కేడర్ అయోమయంలో పడింది. ముగ్గురిలో టికెట్ ఎవరికి వచ్చినా కలిసి పనిచేస్తామన్న వరిస్థితి మాత్రం కనిపించడం లేదు.

### సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్..



సరోజినీదేవి కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తూ పార్టీలో చేరారు. పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాలను చేపడుతూ అవకాశం దొరికినప్పుడల్లా పార్టీ పెద్దలను కలుస్తూ వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మరో అడుగు ముందుకువేసి ఎన్నికలు వచ్చేసాయా అన్నట్లుగా ఆయన ప్రచార పర్వంలోకి దిగేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధితో పాటు పార్టీ అధికారంలోకి వస్తే నెరవేర్చే పలు హామీలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంచిపెట్టే పనికి పూనుకున్నారు.

### భర్త అధిష్ఠానంలో కీలక పదవీ ఆశతో..



నియోజకవర్గ ప్రజలకు ఇప్పుడిప్పుడే పరిచయం అవుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా తనకే టికెట్ అంటూ తెరమీదకు వచ్చారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడి వారికి భరోసా కల్పించడంతో పాటు పార్టీలో ఎప్పటినుంచో ఉన్న నేతలు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశమై మద్దతు కోరుతున్నారు. నీలిమా టీపీసీసీలో కీలక పదవిలో ఉండడంతో పాటు ఆమె భర్త ఏఐసీసీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తుండడంతో అధిష్ఠానం ఆశీస్సులు తమకే ఉంటాయన్న విశ్వాసాన్ని కార్యకర్తల్లో కలిగిస్తున్నారు.

### శశిధర్‌రెడ్డి తనయుడు..



మరోవైపు మర్రి శశిధర్‌రెడ్డి తనయుడు మర్రి ఆదిత్యారెడ్డి సైతం తనకే టికెట్ వస్తుందన్న విశ్వాసంతో ఉన్నారు. ఏకంగా బేగంపేటలో పార్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని సైతం ప్రారంభించి తన కార్యకలాపాలను కొనసాగించేందుకు సమాయత్తమయ్యారు.అలాగే పూర్వ నేతలను కలుస్తూ తనకు మద్దతుగా నిలవాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తే క్రమంలో బన్సీలాల్‌పేట హమాలీ బస్తీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల శిలాఫలకం సెల్ఫీ దిగి కేటీఆర్‌కే సవాల్ విసిరారు. అయితే పార్టీ అధిష్ఠానం మాత్రం సర్వేల ఆధారంగానే టికెట్లు కేటాయిస్తామని ఘంటాపదంగా చెబుతుండడంతో ఎవరికి టికెట్ దక్కుతుందో చూడాలి మరి.

## పద్మారావునగర్ పార్కులో బోనాల వేడుకలు

పద్మారావునగర్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పార్కులో ఆదివారం అమ్మవారి బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్ తరాలకు మన సంస్కృతిని చాటిచెప్పేవి పండుగలు అని పేర్కొన్నారు. పద్మారావునగర్ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రతి ఒక్కరు ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో సంతోషకరమన్నారు. భిన్న సంస్కృతులు, ఆచార వ్యవహారాలు ఉన్న ప్రతి ఒక్కరు బోనాల వేడుకల్లో సామూహిక బోనాల ద్వారా వాకర్స్ తమ ప్రేమ, ఆప్యాయతను చాటుకోవడం అభినందించదగిన విషయమన్నారు. పద్మారావునగర్ పార్కు అభివృద్ధి కోసం తాను అన్ని విధాలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, సుధాకర్‌రెడ్డి, ఏసూరి సావిత్రిమహేష్, బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇన్‌చార్జి జి. పవన్‌కుమార్‌గౌడ్, తలసాని సాయికిరణ్ యాదవ్, ధరమ్ యాదవ్, వెంకటేషన్, టి. వెంకటరమణ, ఏసూరి మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, ముక్కా శ్రీనివాస్, వెంకట్, లంబు శ్రీను, రవి, రాజేష్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రణవీర్, శ్రీధర్, ఈసీ రావు, క్రిష్ణయాదవ్, లింగం, మధుసూదన్‌రెడ్డి, క్రిష్ణారావు పాల్గొన్నారు.



బోనాల వేడుకల్లో పాల్గొన్న మంత్రి తలసాని

## తెప్పోత్సవానికి తరలిన గంగపుత్రులు



వలలతో కార్యక్రమానికి వెళ్తున్న గంగపుత్రులు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ గంగ తెప్పోత్సవ కార్యక్రమానికి ఆదివారం పెద్ద ఎత్తున గంగపుత్రులు తరలి వెళ్లారు. నెక్లెస్ రోడ్డులోని గంగమ్మగుడికి రాణిగంజ్ కస్తూర్బానగర్ నుంచి రాణిగంజ్ గంగపుత్ర సంఘం అధ్వర్యంలో జలపాందిరి, చాపల బుట్టి, తోపాలా, చాపల వల తదితర సామగ్రితో గంగమ్మ దేవాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కులవృత్తి సంప్రదాయాన్ని ప్రతి యేటా గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆరేటి శివకుమార్, సందిరి మల్లేష్, మూట ఐలయ్య, మాకు ఎల్లేష్, ఆరేటి బాలనర్సయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, వెంకటేష్, సాయికుమార్, దుర్గయ్య పాల్గొన్నారు.

## మంత్రి తలసాని క్షమాపణ చెప్పాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంత్రి శ్రీనివాస్‌యాదవ్ దిష్టిబొమ్మను గిరిజన శక్తి విద్యార్థులు ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట దహనం చేశారు. ఈ నెల 19న నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్ వద్ద స్టీల్ బ్రిడ్జి ఓపెనింగ్ సందర్భంగా ఎస్టీ నాయకులు, భైంస మార్కెట్ కమిటీ ఛైర్మన్ జాదవ్ రాజేష్‌బాబుపై మంత్రి చేయి చేసుకొని అవమానించారంటూ గిరిజనశక్తి నాయకులు ఖండించారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్ 24 గంటల్లో క్షమాపణ చెప్పాలని లేకుంటే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్‌నాయక్, హనుమంతునాయక్, సుధాకర్ నాయక్, సతీష్‌నాయక్ పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థులు

## దోమల నివారణపై విస్తృత ప్రచారం అవసరం

సనత్‌నగర్: దోమ కారక వ్యాధులన్నీ నిర్మూలించవచ్చని అయితే దోమల నిర్మూలన పట్ల సరైన అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అన్నారు. ఆదివారం బేగంపేటలోని సర్ రోనాల్డ్‌రాస్ భవనంలో నిర్వహించిన ప్రపంచ దోమ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో దోమల వృద్ధి చెందుతున్నాయన్నారు. అసలు దోమలు వృద్ధి చెందే విధానం తెలుసుకుని ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణపై విస్తృతమైన ప్రచారం, అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధ్యాపకులు, విద్యార్థులపై ఉందన్నారు. చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబుతో కలిసి ఆయన 'వెక్టర్ బార్న్ డీసీజెస్' గురించి వివరించారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్, జంతు శాస్త్ర విభాగాచార్యులు ఎం.మాధవి రచించిన 'హ్యాండ్ బుక్ ఆఫ్ డెంగీ'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ జి.అమర్‌సింగ్‌నాయక్, ప్రొఫెసర్ కరుణసాగర్, ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వీరయ్య పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు నోముల ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ ప్రారంభించారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని సీతాఫల్‌మండి చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీదేవి నర్సింగ్ హోం చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించి శాంతి కపోతం(పావురం) ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ ఎప్పుడో అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిందేమీ లేదన్నారు. ఇంతకాలం స్థానికులకు అవకాశం లేకపోవడంతో స్థానికేతరులు గెలుస్తూ వచ్చారని, ఈ సారి స్థానికులకే సీట్లు కేటాయించే విధంగా అధిష్ఠానం దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి కుమార్, సురేష్ లాల్, జగదీష్, వహీద్, మధుకర్, అభిషేక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అనిల్ కుమార్

## ట్రాఫిక్ మళ్లింపుతోనే వాహనాల రద్దీ

లాలాపేట: ట్రాఫిక్ మళ్లింపు కారణంగానే తార్నాక ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉందని నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'తార్నాకలో ట్రాఫిక్ జాం' కథనానికి స్పందించారు. ఉప్పల్ నుంచి రామంతాపూర్ మీదుగా వెళ్లాల్సిన వాహనాలు అంబర్‌పేట ఛేనెంబర్ మార్గంలో కొనసాగుతున్న ఫ్లై ఓవర్ రోడ్డు పనుల కారణంగా ఆ వైపు నుంచి వెళ్లాల్సిన బస్సులు, ఇతర వాహనాలు తార్నాక నుంచి సికింద్రాబాద్, అడిగ్‌మెట్ మీదుగా మళ్లించాల్సి రావడంతో తార్నాకలో వాహనాల రద్దీ నెలకొందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. శనివారం రాత్రి ఏర్పడిన ట్రాఫిక్ జాం క్లియరెన్స్‌కు పోలీసు సిబ్బంది ఎంతగానో శ్రమించాల్సి వచ్చిందన్నారు.

## సాంకేతిక విప్లవానికి నాంది.. రాజీవ్‌గాంధీ



నివాళిలర్పిస్తున్న ఆదం సంతోష్‌కుమార్



చిలకలగూడలో..

లాలాపేట: దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది మాజీ ప్రధాని దివంగత నేత రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో రాజీవ్‌గాంధి విగ్రహానికి నివాళులర్పించారు. నోముల ప్రకాష్‌రావు, సురేష్, జగ్గు, వేముల శ్రీనివాస్, లాజరస్, నర్సింహ, లింగయ్య, బోదాసు నర్సింహ పాల్గొన్నారు.

**వారాసిగూడ చౌరస్తాలో..**

బౌద్ధనగర్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ నేతృత్వంలో వారాసిగూడ చౌరస్తాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఆదం సంతోష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదం సృజన్, అనిల్ కుమార్, జయరాజ్, అమర్‌నాథ్, సందీప్, అబ్బు, లింగారెడ్డి పాల్గొన్నారు.

**అడ్డగుట్టలో..**

అడ్డగుట్ట: అట్టగుట్టలో నిర్వహించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో గంట రాజుసాగర్, దాడిగ సందీప్, అమర్‌నాథ్, సుదర్శన్, యూసుఫ్, చంద్రకళ, భూపతి హరి, కృష్ణారావు పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు.

**సాయిబాబా ఆధ్వర్యంలో..**


చిలకలగూడ : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అనీల్‌కుమార్‌యాదవ్ పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సందీప్‌రాజ్, గంటా రాజు, అంజిదేవుడు, వెంకట్, బాబు, రవిశంకర్, రాధాకృష్ణశర్మ, శ్యామ్ పాల్గొన్నారు.

## మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చడమే లక్ష్యం

అమీర్‌పేట: మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చడమే తమ లక్ష్యమని ఎంసీఆర్ఎఫ్ ఛైర్మన్, టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి అన్నారు.రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా అమీర్‌పేట కుమ్మరి బస్తీ, ఎస్ఆర్‌నగర్‌లో మహిళలకు కుక్కర్లు, టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. మర్రి చెన్నారెడ్డి ఫౌండేషన్ ద్వారా నైపుణ్య శిక్షణ తరగతులు అందుబాటులోకి తెచ్చామని వీటి ద్వారా మహిళలకు నైపుణ్యంలో మెళకువలు నేర్పించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతామన్నారు. మనోజ్‌కుమార్, విఠల్, శివకుమార్ లాల్, ప్రకాశ్‌యాదవ్, చందు పాల్గొన్నారు.

**చీరల పంపిణీ..**

రాంగోపాల్‌పేట్: పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆదిత్యారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చుట్టలబస్తీలో మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ టెంపుల్ మాజీ ఛైర్మన్ విఠల్, నాయకులు త్రికాల మనోజ్, చక్రం, చందు, కిరణ్, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కుక్కర్లు అందజేస్తున్న మర్రి ఆదిత్యరెడ్డి

### ఇందిరమ్మనగర్‌లో 'బస్తీనిద్ర'

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు జీహెచ్ఎంసీలో విలీనం చేసి పేదలకు ఇళ్ల పట్టాలను అందజేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. బస్తీనిద్రలో భాగంగా ఇందిరమ్మనగర్‌లో శనివారం రాత్రి స్థానికులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. రేపటి నుంచి నియోజక వర్గవ్యాప్తంగా ప్రజాభిప్రాయ పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం బస్తీవాసులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నరేష్, యాదగిరి, రవి, మల్లేష్, రఘు, రమేష్, వినోద్, దినేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### లెవల్స్ చూసుకుని రోడ్డు వేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న శేషుకుమారి

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బల్కంపేట బీజేఆర్ నగర్‌లో వేస్తున్న రోడ్లను లెవల్స్ చూసుకుని వేయాలని మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి సూచించారు.లెవల్స్ లేకుండా రోడ్డు నిర్మిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆదివారం బస్తీలో పర్యటించి రోడ్డును పరిశీలించారు. పాత రోడ్డును కట్ చేసి లెవల్స్ చూసుకుని రోడ్డు వేయాలని లేకుంటే రోడ్డు ఎత్తు పెరిగిపోయి భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. హనుమంత్‌రావు, కట్ట బల్‌రాం, కూతురు నర్సింహ, మోత్కుపల్లి రమేష్ పాల్గొన్నారు.

### గృహిణి అదృశ్యం



గాయత్రి

చిలకలగూడ : గృహిణి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన గాయత్రి (25), బాబు భార్యాభర్తలు. వీరికి ఓ కుమార్తె ఉంది. ఈ నెల 19న పాపను పక్కింట్లో అప్పగించి ఉద్యోగ ఇంటర్వ్యూ కోసమని వెళ్లిన గాయత్రి తిరిగి ఇంటికి రాలేదు. సెల్‌ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తుండటంతో తల్లి రేణుకా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

అడ్డగుట్ట: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ వివరాల ప్రకారం.. అడ్డగుట్టలోని శాస్త్రీనగర్‌కు చెందిన దుర్గమ్మ (50) ఇళ్లలో పని చేస్తోంది. కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆమె ఆదివారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

### వ్యక్తి మృతదేహం స్వాధీనం

చిలకలగూడ: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్న ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న గస్తీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఎలాంటి ఆధారాలు లభించలేదని మృతుని వయసు సుమారు 35 ఏళ్లు ఉంటాయని, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

### 'బీజేపీ విజయం ఖాయం'

లాలాపేట: రాష్ట్రంలో బీజేపీకి ప్రజల మద్దతు ఉందని బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ముంబయి ఎమ్మెల్యే పరాగ్ అల్వానీ అన్నారు. ఆదివారం తార్నాకలో సికింద్రాబాద్ నియోజకవర్గం ముఖ్యనాయకుల, శక్తి కేంద్రాల, వివిధ మోర్చా, పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే మూడు నెలలు పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారిని భాగస్వామ్యం చేసేందుకు కృషి చేయాలన్నారు. నాగేశ్వర్‌రెడ్డి, కార్తీకరెడ్డి, రవిప్రసాద్, సతీష్, విజయ్‌కుమార్, సారంగపాణి, కృష్ణమూర్తి, హరి, వీరన్న, ప్రభుగుప్తా, శారదామల్లేష్, వెంకటేష్‌గౌడ్, రాము వర్మ పాల్గొన్నారు.

**అమీర్‌పేటలో..**

అమీర్‌పేట: బీజేపీ అధికారంలోకి రాబోతుందని బూర్గుల శ్యాంసుందర్ గౌడ్ అన్నారు. అమీర్‌పేట్‌లో చేపట్టిన ఎమ్మెల్యే ప్రవాస్ కార్యక్రమంలో కర్ణాటక బైందూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గురురాజ్ శెట్టి హాజరై వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలకు దిశానిర్దేశం చేశారు. మర్రి శశిధర్ రెడ్డి, ఆకుల విజయ, కార్పొరేటర్లు సరళ, దీపిక, చీర సుచిత్ర, దయానంద్, రవీందర్, శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.

### బీజేపీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం మూడవ వార్డు అన్నానగర్ ముదిరాజ్ సంఘం భవనంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బీజేపీ నాయకురాలు డాక్టర్ సుష్మిత శంకర్రావు ప్రారంభించారు. చిన్నపిల్లల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 200 మంది చిన్నారులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశామని సుష్మిత శంకర్రావు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో చిన్నారుల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, భాగ్యలక్ష్మి, అనురాధ, డాక్టర్ కే.కేశయ్య, రేఖ, సునీత, దయానంద్ పాల్గొన్నారు.



## త్వరలో ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభం

అడ్డగుట్ట: త్వరలోనే 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తెలిపారు. అడ్డగుట్టలో 30 పడకల ఆస్పత్రి ప్రతిపాదిత స్థలాన్ని ఆదివారం ఆయన కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. అత్యధికంగా పేదప్రజలు నివాసముండే అడ్డగుట్టలో ఆస్పత్రిని నిర్మించడం ద్వారా ఎంతోమంది నిరుపేదలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దశాబ్దాల కోరికైన ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రత్యేక చొరవతో సాకారం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీహెచ్ఓ రాజశ్రీ, అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిశంకర్, నేతలు లింగాని శ్రీను పాల్గొన్నారు.

**పీహెచ్‌సీ పరిశీలన..**

లాలాపేట: తార్నాక డివిజన్‌లోని అర్బన్ హెల్త్ పోస్టు తుకారంగేటు లాలాపేట ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాత్రి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ సందర్శించారు. డాక్టర్ రాజశ్రీతో కలిసి లాలాపేటలో త్వరలో నిర్మించనున్న హాస్పిటల్ నూతన భవనం నిర్మాణంపై చర్చించారు. వీలైనంత తొందరగా నూతన భవనం నిర్మాణం చేస్తామని పద్మారావుగౌడ్ స్పష్టం చేశారు. ఆయన వెంట నాగేశ్వర్‌రావు, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, వనజ ఉన్నారు.



లాలాపేటలోని పీహెచ్‌సీని పరిశీలిస్తున్న పద్మారావుగౌడ్